# మనుషుల్లో దేవుడు

తల్లావఝ్ఝల సుందరం

ఆ కొండ-పుట్టాగట్టూ దాటుకొని రాయిరప్పల గోతుల మధ్యన గతుకుల బాటలో వస్తే, గడ్డి చాపరు వేస్తున్న ముసలి దున్నలా చడి చప్పుడు లేకుండా పడుంటుంది ఆ వూరు. బొమ్మరాటలో ఓణీలు వేసుకొని ముచ్చట తీర్చుకొనే ఆడపిల్లలా ఓ మెట్టు సరుకు పల్లెగా మారదామని సరదాపడి-సరదా సవర్రాడినా చాకలి కోక తీసుకుపోతుం దన్నట్టు రాజకీయాలకు భయపడి యధావిధిగా వుండిపోయింది.

వొయ్యిలో పిల్లిలేవకపోయినా గోడకి దేవుడి పటం పెట్టి పూజించటం మనదేశంలో ఆచారం అయితే, దాన్ని పాటించడం మా విధి అంటాయి ఆ వూరి గడపలు. కాయకష్టం చేసుకొనేవాళ్ళు ఆ కష్టాన్ని దోచుకునే వాళ్ల భక్తులు, రసికులు, చిల్లర మల్లర గాళ్లు కలిపి మొత్తం ఐదువందల గడపలు దాకా వుంటాయి.

ఊరి పేరు పిసినికాడ

తద్దినం నాడు కడుపు నిండిన భోక్తలా ఎప్పుడూ మత్తుగా జోగుతుండే ఆ వూరికి నిద్రపోతున్న నెత్తిమీద రాయిపడ్డట్టు చలనం కలిగింది. ఆ తాకిడికి తట్టుకోలేక వూరు వుక్కిరిబిక్కిరయింది.

ఎండలు వొళ్ళు విరిచాయి!

అప్పుడే ఎన్నికలకి కూడా కాళ్ళొచ్చేయి!!

ఎన్నడూ ఎరుగని అంతటి ఎండలకు ఒడ్డున పడ్డచేపల్లాగిల గిలలాడి పోయేరు ప్రజలు. చెట్టూచేమా వాడిలి పోయేయి. ఊళ్ళో బావులన్నీ ఎండిపోయేయి. ఎండి పోయిన చెరువు పట్టాలు పంచే బంజరు భూమిలా వుంది. మాయట పడ్డ కప్పలు అపోజిషన్ లీడర్లలా కొన్నాళ్ళు అరిచి మరి చప్పుడు చెయ్యలేదు. మేత దొరకని పశువులు మనుషుల్ని తినలేక ఏడొంకలోనో శాశ్వతంగా కన్ను మూసేయి, చాలా మట్టుకు.

అవసరమైన వస్తువుల్ని దాచిపెట్టి అత్యవసరమైనప్పుడు ఎక్కువ రేటుకి అమ్ముకునే పక్కా వ్యాపారస్థుల లౌక్యం ఆ మారుమూల వాళ్లకు కూడా ప్లేగు వ్యాధిలా వ్యాపించింది. అక్కడికి రెండు మైళ్ల దూరంలో వున్న ఎండని దిగుడు బావుల్లో-కాలవల్లో రిబ్బను ముక్క పరిమాణంలో వున్న నీళ్లు తెచ్చుకొని నోటికొచ్చిన రేటు చెప్పి అమ్ముకొంటున్నారు. అలా కొనుక్కునే సత్తాలేని వాళ్ల కులం, గోత్రం మర్చిపోయి పల్లిక్కుగా కాళ్లు పట్టుకొని కడివెడు నీళ్లు సంపాదించుకొని ప్రాణాలు కాపాడుకొంటున్నారు పదవి వున్న పెద్దలకు, డబ్బున్న గౌరవనీయులకు పెరటి తెరిచి అడక్క-ముందే నీళ్ళు సరఫరా అవుతున్నాయి.

పడమటి వేడిగాలికి నెత్తురు మరిగి సెగలొస్తుంటే ఆ తపన చల్లార్చుకోడానికి నీటి చుక్క మాత్రం దొరకటం లేదు. కానీ నెలలో పడ్డ ఎన్నికల వేడిని మాత్రం కల్లు ముంతలతో చల్లార్చుకొంటున్నారు.

ఈ కరువు కాటకాలకి కారణం కూలిపోడానికి సిద్ధంగా వున్న పురాతన దేవాలయంలో సంస్కారం లేకుండా పడున్న దేవుడ్ని చిన్నచూపు చూడటమే!! స్వామిని నిర్లక్ష్యంగా చూసిన డబ్బున్న వారిమీద, భక్తులమీద, పాపులమీదా విసుగు జనించిన స్వామి వారు మూడో కన్ను తెరచిన ఫలితం ఈ దారుణం! అని వూళ్లో అందరూ అనుకున్నారో లేదో గాని పూజారిగారు మాత్రం అనుకొన్నారు. ఆయన మథనని అందరిముందూ వుంచేరు. ఎటొచ్చీ ఎవరూ పట్టించుకోలేదు

పాపం దేవుడు మాత్రం గర్భాలయంలో మగ్గిపోతున్నాడు ఎండ వేడికి.

ఏ అమెరికా వాడో వచ్చి ఆ వూర్ని కొంటానంటే ఆ పరిస్థితుల్లో అందరూ ఆనందంగా అందుకు వొప్పుకోవచ్చు కానీ పెద్ది రెడ్డిగారు.... మాత్రం అందుకు ససేమిరా ఒప్పుకోరు. 'నాదు జన్మభూమికంటె నాక మెక్కుడుది-" అన్న పాట వాళ్ళమ్మాయి హార్మోనియం పెట్టెమీద పాడి విన్పించలేదు ఎప్పుడూ— ఆయన గాంధీగారితో పాటు వుద్యమాల్లో పన్జేసి దేశభక్తిని రక్తంలో జీర్ణించుకొన్నవాడు కాదు. ఆయనకు ఆ వూరంటే వల్లమాలిన అభిమానం-ప్రేమ. అందుక్కారణం బంగారమ్మ అందచందాలు కావచ్చు! బీదా, బిక్కీ అభిమానం కావచ్చు! సర్పంచి పదవి కావచ్చు!! మరేదేనా కావచ్చు!-కొన్ని ఇష్టాలకు పెద్దగా కారణాలు కన్పించవు-కాబోలు!

ఆయనకు దేవుడన్నా, ప్రజలన్నా పరమ భక్తి-మూడో నిధి చెంగల్రావ్ నాయుడంటే పరమ అసహ్యం. హరిజనవాడ ఓట్లంటే పరమ భయం- గాంధీగారంటే అమితమైన గౌరవం. ఆయన పదవినీ, ముండల్ని విడిచి వుండలేరు. నెలలో పడ్డ ఎన్నికల గురించి సతమత మౌతున్న రెడ్డిగారికి కరువొచ్చి పీకలమీద కూర్చోటంతో మానసికంగా కృంగిపోయేరు.

"అయ్యా! మరీసమయంలో మీరు ప్రజల్ని ఆదుకోకపోతే మీకు, మన మెంబర్లకు ఓట్లెయ్యడానికి జనం వుండరు-కవాలు తప్ప! ఈ తరుణంలో ఏదేనా తారక మంత్రం వేసి వాళ్ళను ఆకు కొన్నారంటే మీ వంశ పారంపర్యంగా ఈ పదవి ఖాయం..." అన్న మునసబు మాటలో యదార్థాన్ని కాదనలేకపోయింది ఆయన వికలిత మనసు.

"అయ్యా! నా మాట విని స్వామి వారికి కుంభాభిషేకం చేయిద్దాం-తప్పకుండా వర్షాలుపడ్తాయి.... అసలీ అరిష్టాలకు మూలం ప్రజల్లో నాస్తికత్వం జరగటమే! మించిపోయింది లేదు.... ఆలయాన్ని పునరుద్ధరణ చేయించి కుంభాభిషేకం...."

"సూడు పంతులూ! నీల్లునేక పెజ మాడిపోతుంటే నువ్వు కుంభాభిషేకం అంటావేటి?!.... ముందు నోరున్నోల్ల సంగతి సూడ్నీవయ్యా!!"-అని పూజారిగారి మాట కొట్టేసినా.... పోని! కుంభాభిషేకం చేయిస్తేనో?! అని అనిపించింది రెడ్డిగారికి.

తనమీద నమ్మకముంచి తన్నే నమ్ముకొన్న ప్రజల్ని ఈ సమయంలో మీరు ఆదుకోవాలి!!- అన్నదే ఆయన సమస్య. ఆ

రోజు రాత్రి ఆరుబయట డాబామీద భుక్తాయాసం తీర్చుకుంటూ చూసినప్పుడు వూరంతా స్మశానంలా_ వయస్సుడిగిపోయిన ముసల్దానిలా కన్పించినప్పుడు ఆయన హృదయం ద్రవించింది.

ఇంటెదురుగా గోడమీద తన పేరుతో పాటు 'త్రాసు గుర్తు మీ వోటు'_అన్న పెద్దక్షరాలు కర్తవ్యం గురించి తొందర చేసేయి_



## 2

వడదెబ్బ తగిలిన చిన్నపిల్లాడిలా సూర్యుడు పడమటి కొండల వెనక వాలిపోయేడు.

మిట్ట మధ్యాహ్నం తాహాకు మంట ముందు కూర్చున్నట్లు హా ఇబ్బంది పడుతున్నారు రచ్చబండ దగ్గర చేరిన జనం.

ఇంటిచుట్టూ పోలీసులుంటే తప్పించుకోవడం ఎలానో అర్థం కాని ఆఖరు సీను దుష్టనాయకుడిలా ఆత్రంగా వచ్చేరు రెడ్డిగారు.

ఉత్తర క్షణం రణ ణ ధ్వని సద్దుమణిగింది.

అది ఎన్నికల సభ కాదు_ సంతాప సభ కాదు_ పురాణ కాలక్షేపం అంతకంటే కాదు. మరి?!!

"నాకు ఈ వూరికి ఎలాంటి బందముందో ఈడపేర్న అందరికీ బాగా తెల్సు. పురా నాళ్లో రుసిగార్లా నాను నీల్లు తేలేను.... ఈ గోరం నుంచి పెజల్ని ఎలాగ కాపాడాలన్న ఆలోసెన సేసి పట్నంలో ఇంజనీరు గార్ని కలిసి ఓ పెనాలి తయారుచేసేం.... అదేటంటే.... మనూరి దేవుడి పొలంలో నేరేడు పెట్టుదగ్గర పెద్ద జలుందని పరీచ్చల వల్ల తెల్సింది. అక్కడ బావితవ్వితే మనకందరికీ కట్టం నేకుండ నీల్లు సంపాయించుకోవచ్చు. ఇది మనూరు పంతులుగారు, పట్నం ఇంజనీరు గారు బాగా పరీచ్చలు జరిపి మరీ సెప్పేరు.... మిగతా ఇవరాలు మునసబుగారు సెప్తారు—" అని గంభీరోపన్యాసం ముగించేరు రెడ్డిగారు.

చాలా ఓపిగ్గా చప్పట్లు చరిచేరు ప్రజలు.

అవకాశం కోసం ఎదురు చూస్తున్న మునసబుగారు క్షణం ఆలస్యం చెయ్యకుండా మొదలు పెట్టేరు.

"రెడ్డిగారు మనందరి కోసరం తిండితిప్పలు మాని శ్రమపడి ఈ పథకం తయారు చేసేరు. అయితే.... ఇది పెదబావి కావటం వల్ల మనందరి కోసం కొంత ఖర్చు కావడం తప్పదు. అది మనందరి కోసరం కాబట్టి.... అది మన పెళ్ళాం, బిడ్డల కోసరం కాబట్టి ఆ ఖర్చంతా మనమే భరిద్దాం. ఎలాగంటే?!!.... చందాలిచ్చి!" రెస్పాన్సుకోసం జనాంతికంగా చూసేరు.

జవాబుగా భజన పరులు చప్పట్లు చరిచేరు.

మీమాంసలో పడ్డారు మరి కొందరు.

మెల్లి మెల్లిగా గుసగుసలు ప్రారంభంఅయ్యేయి. అది గ్రహించిన మునసబుగారు అవి తారాస్థాయికి చేరుకోవక ముందే....

"అయితే అందరూ సొమ్మిచ్చుకోలేరు కాబట్టి మిగతా వాళ్ళ

కులీ అడక్కుండా బావి తవ్వుతారు. ఇదికేవలం మనకోసం అని మనవి చేసుకొంటున్నాను. బాగా ఆలోచన చెయ్యండి....మరికొద్ది రోజులు పోతే మనం వకూ్కాళ్ళ నింపి తెచ్చుకుంటున్న బావులు కూడా ఎండి పోతే మనందరం ఏమై పోవాలి?"- ఆయాసం తీర్చుకోవడం కోసం ఆగేరు మునసబుగారు.

ఓ విధంగా సభ ముగిసినట్లే.

చాలా మంది చాలా రకాల అభిప్రాయాలు వెలిబుచ్చేరు. ఖర్చు ఎంతయ్యేది ఇదమిద్దంగా తేల్చలేదు గిట్టని వాళ్ళు. ఇందులో పెద్దలకు ఎంత మిగులుందోనని దిగులు పడ్డారు, ఇదంతా ఎలక్షన్ స్టంట్....." అని కూడా అనకపోలేదు.

బీదా బిక్కీ, ఆ వూర్నే నమ్ముకొన్న రైతుకూలీలు కూలీఅడక్కుండా కష్టపడ్డానికి నిర్ణయించేరు. వాళ్ళ నిర్ణయానికి ఆ సభలోని పెద్దలు అందరూ ఓపెన్‌గా హర్షం వెలిబుచ్చేరు.

ఓ మంచి కార్యం కోసం అన్ని కులాలు, మతాలు ఏకమై పనేయడానికి నిశ్చయించుకోవడం హర్షదాయకమే! ఇదే నిజంగా గాంధీగారు కలలుకన్న రోజు"....అన్నారు ఇదరు పెద్దలు.

ఆ క్షణం నుంచే చందాలు వసూలు చెయ్యడం ప్రారంభించేరు. తాహతు కొద్దీ విరాళాలిచ్చేరు. ఘనత రెడ్డి గారికి దక్కింది. ఆయన భక్తులు "భగీరథుడని" బిరుదు కూడా ఇచ్చేరు. నిజమేనన్నారు మేహమాటస్తులు.

ఎన్నికలకు మంచి పునాది దొరికిందని ఆనందించేరు రెడ్డిగారు. ఏనోట విన్నా, ఏ పాట పాడినా రెడ్డిగారిగురించే..ప్రతివాళ్ళ ఆశా రాబోయే బావిమీదే!!

బావి తవ్వడానికి మంచిరోజు నిర్ణయించేరు.

"ప్రశస్తమైన రోజు...."అని పంతులు గారు కొబ్బరికాయ కొట్టేరు.-బలికూడా ఇచ్చేరు దాని మీద నమ్మకం వున్న కొందరు.


పలుగులకి, పార్లకి బొట్లు పెట్టేరు.

గునపంతో మొదటి పోటు పొడిచేరు రెడ్డిగారు.

పట్నం ఫొటోగ్రాఫర్ కెమేరా క్లిక్ మనిపించేడు.

తవ్వకం పని ప్రారంభమైంది.

o o o o



"ఈదెబ్బతో చెంగల్రావ్ నాయుడు ఎడ్రస్ లేకుండా పోతాడు. మీ పదవికి ఏ ముప్పూ రాదు...."-భరోసా ఇచ్చేడు మునసబుగారు రెడ్డిగారింటో కాఫీ తాగుతూ-రెడ్డిగారు ఆ మాటకు చిర్నవ్వు చిందించేడు.

"మీరు తలపెట్టిన పుణ్యకార్యం వల్ల అందరూ పాతవైషమ్యాలు, కులగోత్రాలు మర్చిపోయి అందరూ ఏకమయ్యేరు. నిజంగా వూరు బాగుపడ్డానికి ఇది శుభసూచనం.—" అన్నారు రాజకీయాల్లో తల పండిన జోగినాధంగారు.

"అంతే!!"-అని అన్లేదు రెడ్డిగారు-మునసబుగారు మంత్రం ఆలస్యం చెయ్యకుండా అన్నారు.

"అదేవిటండీ....!!అందరూ కల్సిపోయి బావి తవ్వుతున్నారు. నీళ్లొచ్చిన తర్వాత మరి అందరూ కల్సి పంచుకుంటారుకదా?!! ఆ బావి పుణ్యమా అని నిమ్న కులాలవాళ్లు ఆ బావిలోనే కదండి నీళ్ళు తోడుకునేది....!! ఇంత సఖ్యత మన వూళ్ళలో ఎప్పుడేడ్చింది?!!" అని విపులీకరించేరు. అందులోగూడార్థం మాత్రం రెడ్డిగారి గుండెకు సూటిగా తగిలిందనే చెప్పొచ్చు.

గొంతులో యాసిడ్ పోసుకొన్నట్లుండిపోయేరు కరణం, మునసబులు. తను కూర్చున్న భూమి కుంగుతున్నట్టు మతిపోయి చూసేరు రెడ్డిగారు. "అయ్యా! మరి అందరూ ఒకే చోట నీళ్ళు తోడుకోవడ మంటే తర్వాత చాలా గొడవలొస్తాయి....మరి ఎవర్ని కాదన్నా కష్టం!! దానికి తోడు ఎలక్షన్లు...." నసిగేరు మునసబు గారు.

"అలగా జనాన్నందర్నీ నీళ్ళు తోడుకోనిస్తే పెద్ద కులాల వాళ్ళు ఓట్లెయ్యరు....పోనీ వీళ్ళను సపోర్టు చేస్తే ఆ కులాలవాళ్ళు చెంగల్రావ్‌కు జై అంటారు...." కరణంగారు.

రెడ్డిగారు గోడకు కొట్టిన మేకులా వుండి పోయేరు.

"మనందరం ఒకటను కొంటే మరోటి జరిగేలా వుంది.... మరి వాళ్ళు నీళ్ళు పట్టుకునే చోట మనంకూడా నీళ్ళుపట్టుకోవాలంటే కష్టమే మరి!!....ఏం చేద్దామంటారు?!!

"అల్లందరి మధ్య నీళ్ళుతోడుకోవడం మావోల్లకి మాత్రం సర్దాఏటి?! ఆ నీల్లుతాగడం నాకుమాత్రం ఇష్టమేటి?!....ఏటి పేత్తాం ఏదో ఆలోసెన సెయ్యాలి....తొందరపడితే పన్లెలగ జరుగుతాయి.... ఈ వారం రోజులు గడిపేస్తే ఎలక్షన్లు జరిగి పోతాయి. ఆయెనక సుద్దాం."—చిరు చిరాకు ప్రదర్శించేరు రెడ్డిగారు.

శత్రుసేనల మధ్య వంటరిగా చిక్కుకు పోయినట్లుంది రెడ్డిగారి పరిస్థితి. చావులాంటి నిశ్శబ్దంలో చాలా క్షణాలు కదిలిపోతున్నాయి. కొత్తగా ఉత్పన్నమైన సమస్య అందరి మెదళ్ళకి పదును పెట్టింది.

3

ఎన్నికల వేడి పూరిగా తగ్గిపోయింది.

వెనకబడ్డ వర్గాల వోట్లతో-పెద్ద కులాల వాళ్ళ ఆశీస్సులతో పెద్దిరెడ్డిగారి మనుషులు ఖర్చులేకుండా, శ్రమలేకుండా గెల్చేరు. అందుక్కారణం ప్రజల కోసం పెద్దిరెడ్డిగారు అనుక్షణం పడుతున్న శ్రమ.

గెలిచిన సంబరంలోకూడా రెడ్డిగారు ప్రజల్ని మర్చిపోలేదు. బావిలో ఇంకా జల పడకపోవడం ఆయన్ని బాధించని క్షణం లేదు.

బావిలో నీళ్ళు పడేలా కటాక్షించమని దేవుణ్ని పర్సనల్‌గానూ, పబ్లిక్‌గాను ప్రార్థించేరు.

నీళ్ళు పడింతర్వాత రాబోయే పరిస్థితి ఎలా ఎదుర్కోవాలోనని ప్రతిరాత్రి ఆయన చింతిస్తుంటే ఓ రాత్రి దేవుడికి జాలివేసి తరుణోపాయం కలలో బోధించి మాయం అయ్యేడు. ఆ సంతోషంలో మునసబుగారికి, పూజారి పంతులుగారికి వెంటనే కబురు చేసేరు రెడ్డిగారు.




ముంత దగ్గర నిద్దుల్లో మునిగిపోయున్న మునసబుగారు గజేంద్రుడి కేక విన్న విష్ణుమూర్తిలా వున్న పళంగా పారిపోయేరు రెడ్డిగారి సన్నిధాన.

"ఏటి బాబూ! ఇంత అర్ధరాత్రి పూట కబురు పెట్టేరు?!"– ఆవలిస్తూ దూరమైన నిద్రవాన్ని గుర్తుచేసుకుంటూ అన్నారు మునసబుగారు.

"ఇన్నాళ్లనుండి మనం అనుకొంటున్న విషయం గురించి ఓ ఆలోచనొచ్చింది.... క్షణం ఆగు పంతులుగారుకూడా వస్తారు...."—అని ఆయన మాట పూర్తి చేసే లోపలే హుటాహుటీగా వచ్చేరు స్వామి భక్తిపరాయణుడు కావటంతో. వినయంగా చేతులు కట్టుకొని నిల్చున్నారు.

రెడ్డిగారు చీకటి చీలేలా పలకరింపుగా నవ్వేరు.

ముగ్గురి మధ్య మౌనం పహరా కాస్తోంది.

ఆయుధాలు ఇవ్వడానికి అమెరికా ప్రెసిడెంటూ–భస్మాసురుడికి వరం ఇవ్వడానికి శివుడూ కూడా అంత ఇబ్బంది పడుండరు. కానీ రెడ్డిగారు తమ హృదయ్యకొన్న విషయం చెప్పలేక నరకం అనుభవించేరు.... క్షణాలు నెమ్మదిగా జారుకొన్నాయి.

"అయ్యా! తమరు పిలిపించిన కార్యం...."—మొహమాటంలో కుంచించుకుపోతూ నెమ్మదిగా అన్నారు పూజారిగారు.

"నావిందాకా మకెయ్యబోతుంటే దిగులుగా ఆపద్దాదయ్యా పాపం మద్దేముడు.... గుండె తక్షణం నలిగిపోనాది. అందుకే ఆలయం బాగుపేయాలమని....దాంతో పాటు మంచి అభిషేకం కూడా పేయిద్దామని ఆలోసెనొచ్చి నీకు కబురంపేను....మరి ఇలాంటి ఇసయాలు నీ పెవిలోయెయ్యాలి గదా!"—అని ముందు మాట పలికి దేవాలయం బాగోగులకి అయ్యే ఖర్చు గురించి చర్చించారు.

మేధమెటిక్స్ శాస్త్రాన్ని మమాల్స్ గురించి పాఠం చెప్పమన్నంత ఇబ్బంది పడుతున్నారు. మునసబుగారు. అర్ధరాత్రిపూట దేవుడి బాగోగుల గురించి మాట్లాడుకొంటున్న ఇద్దర్నీ చూసి.

సుదీర్ఘ చర్చల అనంతరం పూజారిగార్ని పంపించేరు ఇన్నాళ్ళకు ఆలయం గురించి పట్టించుకుంటున్న పెద్దల్ని–రెడ్డిగారి దొడ్డ మనసును పదేపదే కొనియాడుకుంటూ, సంబరపడ్తూ వెళ్ళిపోయేరు పంతులుగారు.

విస్కీ వాసన నాసికలకు తగిలినా మునసబుగారు రెడ్డిగారి వ్యూహం గురించి ఆలోచిస్తున్నారు.

చీకటిచ్చిన వెచ్చటి మత్తులో పూరంతా బుద్ధిగా నిద్దరపోతోంది. సరిగ్గా అప్పుడే రెడ్డిగారు మునసబుగారికి గీతా రహస్యాల్ని విశద పర్చేరు.

## 4

ఆ సంబరం గెల్చినవాడి ఆనందం కాదు!!

ఇరవై రోజులు పైపడ్డ ప్రయాసకు ఫలితం దొరికింది. తిండి, తిప్పలు మర్చిపోయి నిరాశ, నిస్పృహలు దూరం చేసి అహో రాత్రులు కష్టించినందుకు దేవుడు వరమిచ్చేడు.

బావిలో నీళ్లు పడ్డాయి!!

"నిజంగా దేవుడున్నాడు....!!"–అని మరో మాట అనుకున్నారు అందరూ! జల పూరిన ఆ బురదలో చిందులేసేరు శ్రమ మర్చిపోయిన ఆ ఆనందానికి అవధుల్లేవు.

చుట్టుపక్కల ఏ వూళ్ళోనూ లేనంత బావి!!

చిందులేసేరు – గెంతులేసేరు. దేవుడికి తల వాచిపోయేలా కొబ్బరికాయలు కొట్టేరు. దేవుడే రెడ్డిగారి రూపంలో అవతారమెత్తి నీళ్లొచ్చేలా చేసేరన్నారు. కాదని మాత్రం ఎవ్వరూ అన్లేదు

పిల్లా, పెద్ద అందరూ ఆనందంలో ఉక్కిరి బిక్కిరయ్యేరు. జల ఎక్కడ పడేదీ చెప్పిన పంతులుగార్ని, ఇంజనీరు గార్ని పూల మాలల్తో వూరేగించేరు.

పోటొచ్చిన సముద్రంలా అందరూ కేకల్తో, అరుపుల్తో కదిలొచ్చేరు రచ్చబండ దగ్గరకు. రెడ్డిగారికి తదితర (?!) పెద్దలకు వేదోక్తంగా సన్మానించేరు.

అవకాశం దొరికిన అందరూ వుపన్యసించేరు.

పూజారి పంతులుగారు రచ్చ బండ మీద నిల్చుని నిశ్శబ్దంగా వుండమని సౌజ్ఞ చేసేసరికి నిశ్శబ్దం చల్లగా ఆవరించింది.

గాల్లో ఎగురుతున్న కుంకుమ ఇంకా నేలను తాకలేదు. అరుపులు ప్రతిధ్వని ఇంకా విన్పిస్తూనే వుంది....

నిశ్శబ్దంలో అందరూ చెవులు రిక్కించేరు.

"దేవుడు మనల్ని చల్లగా చూసేడు. మన ప్రాణాలు కాపాడుకోడానికి గుక్కెడు నీళ్ళు ప్రసాదించేడు. ఆనందం కల్గినప్పుడు దేవుడ్ని మర్చిపోవడం మూర్ఖుల లక్షణం. ఆయన లీల కాబట్టే స్థలంలో నీళ్ళు పడ్డాయి. ఈ పుణ్య కార్యానికి అందరూ చేయూత నిచ్చేరు. అలాగే శిథిలావస్థలో వున్న మన దేవాలయం బాగు చేయించి స్వామివారికి అర్చనలు చేయిద్దామన్న సంకల్పం కలగడం, అందుకు పెద్దలందరు ఒప్పుకోవడం జరిగింది.... అందుకే భగవత్ కార్యానికి కూడా .."

"పంతులు గారూ మీ అభిప్రాయం అర్థమైంది. దేవుడి గురించి మీరింత యిదిగా చెప్పాలా!?.... ప్రజలారా! పంతులు గారు చెప్పినట్లు మన దేవుడి గుడి మనం బాగుచేయించాలి.... ఈ విషయంలో కూడా ఎవ్వరికీ భారం లేకుండా వుండేలా చిన్న పథకం ఆలోచించేం. అదేవిటంటే....! మన బావిలో తోడుకోబోయే నీళ్ళకు అంటే బిందెకు ఒకే ఒక్క పావలా చొప్పున స్వామి వారి కోసం చెల్లించాలి. అలా వచ్చిన సొమ్ముతో గుడిని బాగు చేయించడమే కాక ఎన్నడూ జరుగనటువంటి గొప్ప అర్చన జరిపించి మనకున్న భక్తిని వెల్లడించుకోవాలని నిర్ణయించే...." — అని కరణంగారు అనంగానే ఆకాశం చిరిగి పోతున్నట్లు చప్పట్లు మారు మోగిగేయి.

పథకానికి అందరూ వుత్సాహంగా ఆమోద ముద్ర వేశారు. అన్ని కులాల వాళ్లు ముక్తకంఠంతో తమ సమైక్యత మరో మారు నిరూపించుకొన్నారు, అదే జనం రెడ్డి గారికే ఈ బాధ్యతలు కూడా బలవంతంగా అంటగట్టేరు.

ఇంత కాలానికి తన గురించి పట్టించుకొంటున్న భక్తుల్ని తల్చుకుని వుప్పొంగి పోయేడు అవ్వారి దేవుడు.

5

పడమటి వేడిగాలి దుమ్ముతో పాటు ప్రాణాల్ని కూడా సునాయాసంగా తీసుకుపోయేలా వుంది. కొందర్ని పీల్చేసేలా వుంది ఎండ.

బావి దగ్గర నీళ్లతోడుకున్న పతి బిందెకు సుంకం వసూలు చెయ్యడం మునసబు గారికి శ్రమయినా దేవుడి కోసం, రెడ్డి గారి కోసం ఆనందంగా అజమాయిషీ చేస్తున్నారు.

దేవాలయ పునరుద్ధరణ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది.

అంత భయంకరమైన ఎండల్లోనూ బీదా, బిక్కీ అలగా జనం (?!) రెండు మైళ్ళ దూరంలో వున్న దిగుడు బావుల్లో నీళ్ళు తెచ్చుకోవడం మానలేదు. అందుక్కారణం కొత్తగా తవ్విన బావిలో నీళ్ళండి . పోయికాదు – తోడుకున్న నీళ్ళకి సొమ్ము యిచ్చుకోలేక.

అందరికోసం అని బావి తవ్వినా అది కొందరికే వుపయోగ పడటం అందర్నీ బాధించలేదు.

"బావూ! అందరికోసం అన్చెప్పి కూలీ కూడా అడక్కుండా బావి తవ్వినాం గదా! మరిమాకు గుక్కెడు నీళ్ళియ్యకపోతే మా పేణం పోవాల ?!.... మాకాడ సొమ్మెక్కడ నుంచి ఎలు పొస్తదండి?!.... కుసింత కనికరించండి బావూ!! — " అని ఎవరూ ఎవర్నీ అడగలేదు. కారణం....

వసూలు చేస్తున్న ప్రతిపైసా దేవుడికోసం....!.... ఆయన గుడికోసం!! అర్చనల కోసం!!:

"సావులోరి కోసం సొమ్మిచ్చుకొనే అదురుట్టం మనకా! నేదు.... సి. సి. .... కి త ం జ ల మ లో ఏ పా వ మో సేసుంటాం .... " — అని పలురకాలుగా తమకి తామే సర్ది చెప్పుకొన్నారు పేద భక్తులు.

"సాటి మనిషి సచ్చి పోతున్నా ఎవ్వరూ పట్టించుకోరు .... అదే కనబడ్ని ఆ పాడు దేవుడు కోసరం మాత్రం అందరూ ఏకమై పోతారు.... మీకు లాటోళ్ళందరూ పేరిపోబట్టె ఆడూ పెద్దోలవెవు పేరిపోయి గుళ్ళమీద గుళ్ళు కట్టించేసుకొంటున్నాడు- మీరు బాగుపడాలంటే ముందుగాల ఆడ్ని తొలగించాల.... " — అన్న ఒక్కడూ అర్థ బలం, అంగ బలం లేని వాడు ....బహుశా నా సికుడేమో?! అందుకే ఆతగాణ్ని ఎవ్వరూ పట్టించుకోలేదు.... అతని అమాయకత్వం చూసి జాలి పడ్డారు.

స్వామివారి మీద, దేవాలయం మీద అంత అర్జంటుగా పెద్దలకు భక్తి ఎందుకు కల్గిందో పూజారి గారు ఆలోచించలేదు.

"ఒక్కోసారి దైయ్యం, దేవుడు రాజకీయాల్లోకి మా బాగా వుపయోగ పడ్తాడు....క్షుద్ర విరక్కుండా పామును సంపాల...." అన్న రెడ్డిగారి ఉవాచల్లో అంతర్యం తెల్సుకోడానికి మునసబుగారికి ఆట్టేకాలం పట్టలేదు.

"వారి బుర్రకు పదునెక్కువ.../లేకపోతే ఈ పాటికి కులాల పేరుతో తన్నుకు చచ్చి బావి పూడ్చేసేవారు...."–అని జగన్నాథం గారు రెడ్డిగారి తెలివితేటల్ని మనసులో మెచ్చుకున్నారు.

ఆ వూరి దేవుడు పెళ్ళి ముహూర్తం పెట్టంగానే కార్యం రోజెప్పుడో లెక్క వేసుకొనే కుర్ర పెళ్ళికొడుకులా ఆనందంతో తబ్బిబ్బై పోతున్నాడు గర్భాలయంలో – ఆయనకు భక్తుల గోడు విన్పించుకునే వోపిక లేదు—అందునా అలగా భక్తులు....! *

---